క్లుప్తంగా

పన్నుల వడ్డీపై 50 శాతం రాయితీ

సాలూరు: మున్సిపాలిటీలో ఎరియర్స్, ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నుల వడ్డీపై 50 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. వన్‌టైం సెటిల్‌మెంట్‌గా ఏకమొత్తం ఈ నెల 31లోగా చెల్లించిన వారికి వడ్డీపై 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పన్నులను నేరుగా సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, లేదా సీడీఎంఏ. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా చెల్లించవచ్చన్నారు.

పోలమాంబకు ప్రత్యేక పూజలు



శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి తొమ్మిదవ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు చదురుగుడి, వనంగుడికి చేరుకోవడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. చదురుగుడి ఆలయం వద్ద క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఈవో వీవీ సూర్యనారాయణ, ఎస్సై ఎం.వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు దగ్గరుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. గోముఖి నదీ తీరాన భక్తులు అమ్మవారికి కోళ్ల మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం వనంగుడిలోని పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని, ఆలయం వెనుకన ఉన్న వేపచెట్టుకు పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటలు చేసుకుని భోజనాలు ఆరగించారు.

హెచ్ఐవీ నియంత్రణకు సమష్టి చర్యలు అవసరం

పార్వతీపురంటౌన్: హెచ్ఐవీ నియంత్రణకు సమష్టి చర్యలు అవసరమని పార్వతీపురం మన్యం డీఎల్ఏటీఓ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో ఏఆర్‌టీ కోఆర్డినేటర్లతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఇంకా చాలా అపోహలు ఉన్నందున ప్రజలమధ్య చైతన్యం కల్పించాలని కోరారు. హెచ్ఐవీ టెస్టులు విస్తృతంగా చేయాలని తద్వారా కొత్త కేసులను గుర్తించి త్వరగా చికిత్స అందించాలని సూచించారు. చికిత్స తీసుకుంటున్న రోగులు ఆరోగ్యంగా జీవించేందుకు మద్దతు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఏసీఓ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ సజీయ హస్సేన్, సీపీఎం ఆదిలింగరాజు, ఐసీటీసీ సూపర్‌వైజర్ ఎస్.గోపాలరావు, ఏఆర్‌టీ, డీఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిమిడి వలస బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి

- మాజీ డిప్యూటీ సీఎంకు గ్రామస్తుల కృతజ్ఞతలు



సిమిడి వలస గ్రామానికి నిర్మాణం పూర్తయిన బీటీ రోడ్డు

సాలూరు రూరల్: ఎన్నికల ముందు రూ.1.25 లక్షలతో పడాలవలస రోడ్డునుంచి సిమిడి వలస గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శంకుస్థాపన చేశారు. గిరిజన శాఖ ఆధర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఇటీవల ఆ రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో సిమిడివలస గ్రామ గిరిజన ప్రజలు ఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్న బీటీ రోడ్డు పూర్తి కావడంతో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇరుకురోడ్లతో ఇబ్బందులు



జిల్లా కేంద్రంలో ట్రాఫిక్

- జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలు
- ప్రధాన రహదారిపైనే భారీ వాహనాల రాకపోకలు
- జిల్లా కేంద్రంలో జఠిలమవుతున్న సమస్య
- ప్రత్యామ్నాయ రోడ్ల అభివృద్ధితోనే సమస్యకు పరిష్కారం

పార్వతీపురంటౌన్:

జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలంటే ప్రత్యామ్నాయ రోడ్లు ఏర్పాటు చేయడమే శరణ్యంగా కనిపిస్తోంది. పట్టణంలో ఎక్కడికి వెళ్లాలన్నా ప్రధానంగా రాకపోకలు చేసేది మెయిన్ రోడ్డు ఒక్కటే. ఆ రోడ్డు ఉదయం, సాయంత్రం చాలా రద్దీగా ఉంటుంది. వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పట్టణ పరిసర ప్రాంతాల పరిధిలో ఉన్న వారు పనులపై వచ్చే వాహనాలతో పాటు స్కూళ్లు, కళాశాలలు, ఆర్టీసీ బస్సుల తాకిడి కూడా ఎక్కువే. పట్టణంలో నిత్యం సుమారు 15వేల మంది విద్య, వైద్య, వ్యాపార, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణ ప్రధాన రహదారి, బైపాస్ రోడ్డు మీదుగా ఒడిశా రాష్ట్రంలోని రాయగడ, అలమండ, కొరాపుట్ జిల్లాలకు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు ఒక్కటే కావడం వల్ల ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఇబ్బందులు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో బైపాస్ రహదారికి చర్యలు చేపట్టారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆ పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రహదారిపై దృష్టి సారించని ఫలితంగా పట్టణ ప్రజలు, జిల్లా కేంద్రానికి వచ్చేవారు, ఒడిశా రాష్ట్రానికి ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే పార్కింగ్



పార్కింగ్ లేకపోవడంతో ప్రధాన రహదారిపైనే నిలిపిన వాహనాలు

పట్టణానికి ప్రధాన రహదారి, ఒడిశా రాష్ట్రానికి వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి అదే కావడం, దానికి తోడు ప్రధాన రహదారిపైనే వ్యాపార సముదాయాలు, మార్కెట్‌లు, ఆర్టీసీ బస్టాండ్, ఆటోస్టాండ్‌లు అన్నీ ఉండడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా షాపింగ్‌మాల్‌లు, వ్యాపార సముదాయాల వద్ద సెల్లార్ పార్కింగ్ సదుపాయం లేకపోవడం వల్ల వ్యాపార సముదాయాల ముందు రోడ్డుపైన వాహనాలను పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పార్కింగ్‌కు వ్యాపార సముదాయాల యజమానులు స్థలం కేటాయించకపోవడంతో రహదారిపై పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఆర్టీసీ బస్సులు, స్కూల్‌బస్సులు తిరిగే సమయాల్లో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాటన్నింటికీ పరిష్కారం నూతన బైపాస్ రహదారి నిర్మాణమే.

నూతన బైపాస్ వేయాల్సిందే.



జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వెంకంపేట గ్రామ శివారు నుంచి కొమరాడ మండలంలోని శివిని గ్రామం వరకు నూతన బైపాస్ ఏర్పాటు చేయాల్సిందే. పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భావం తరువాత ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువైంది. అధికారులు సమస్య పరిష్కారానికి కృషిచేయాలి

– పాలకొల్లు గౌరీ శంకర్రావు, వాహన చోదకుడు, పార్వతీపురం పట్టణం

ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు



ప్రజలకు ప్రతినిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పెరుగుతున్న వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కచ్చితంగా ఇబ్బందులు తొలగాలంటే ఇతర ప్రత్యామ్నాయ రోడ్లను ఏర్పాటు చేయడం, రహదారిపై కాలువల ఆక్రమణ తొలగించడంతోనే సమస్యకు చెక్‌పెట్టవచ్చు.

– జి. మాధవ్‌రావు, పట్టణ వాసి

అధికారులు దృష్టిసారించాలి

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరం. పట్టణ ప్రధాన రహదారిపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడం, బస్సులు, ఆటోలు ఎక్కువగా ప్రయాణించడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలను నిలపకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

–బి. జగదీష్, వాహన చోదకుడు

పారిశుధ్య పనులతోనే రోగాలు మటుమాయం



బగ్గందొరవలసలో తీస్తున్న పూడికలను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు శుద్ధ జలాలను అందించినప్పుడే రోగాలు మటుమాయం అవుతాయని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని బగ్గందొరవలసలో సర్పంచ్ ఎ.నారాయణరావు పర్యవేక్షణలో కార్యదర్శి చేయిస్తున్న పారిశుధ్య పనులను ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు జరుగుతున్నాయని, అలాగే ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు, బావుల్లో క్లోరినేషన్ వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రతిగ్రామంలోనూ పారిశుధ్యపనులు క్లోరినేషన్ చేయడం అవసరమని స్పష్టం చేశారు. సర్పంచ్ నారాయణరావు మాట్లాడుతూ గ్రామంలో నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడే రాష్ట్రరహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో తరచూ చెత్త చేరిపోతోందని, కాలువల్లో చేరిన చెత్తను రెండు నెలలకో పర్యాయం తీయిస్తున్నామన్నారు. అలాగే నిరంతరం తాగు నీరు సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు.

రైల్వే గేటు వద్ద స్తంభించిన ట్రాఫిక్



చినభోగిలి గేటువద్ద గోతుల్లో చిక్కుకున్న వాహనాలు

సీతానగరం: మండలంలోని చినభోగిలి రైల్వేగేట్ వద్ద లైన్ అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో ట్రాక్ వద్ద సిమెంట్ రాళ్లు దాటుకుని వాహనాలు రాలేక పోవడంతో వాహనాల రాకపోకలకు మంగళవారం అంతరాయం ఏర్పడింది. చినభోగిలి-మక్కువ,దుగ్గేరు ప్రాంతాల ప్రజలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. మక్కువ నుంచి చినభోగిలి మీదుగా బొబ్బిలి ప్రాంతానికి నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడుతుంటాయి.రద్దీగా ఉన్న చినభోగిలి మీదుగా నిరంతరం రైళ్లు తిరుగాడే రైల్వేగేటు వద్ద గోతులను పూడ్చక పోవడంతో వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రైళ్లు తిరుగుతున్న సమయంలో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని గేట్‌మన్‌తో సహా వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు.

ఆశ వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి



డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: ఆశవర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి సూపరింటెండెంట్ కామేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశవర్కర్లను గ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో సీహెచ్‌డబ్ల్యూలను ఆశ కార్యకర్తలుగా గుర్తించాలని, పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడు సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ఆశవర్కర్లకు కేవలం రూ.1000 మాత్రమే పెంచిందన్నారు. దేశ వ్యాప్తంగా ఒకేరకమైన పరిస్థితులు ఉండవని, కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.సూరిబాబు, ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు శాంతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బురదాలమ్మ సిరిమానోత్సవం



దత్తివలసలో ఊరేగిస్తున్న బురదాలమ్మ సిరిమాను

సాలూరు రూరల్: మండలంలోని దత్తివలస గ్రామదేవత బురదాలమ్మ సిరిమానోత్సవాన్ని గ్రామస్తులు మంగళవారం ఘనంగా నర్వహించారు. ఏటా ఆనవాయితీగా వస్తున్న ఈ పండగలో అమ్మవారికి గిరిజన గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఘటాల ఊరేగింపుతో ప్రారంభమైన పండగ సిరిమాను ఊరేగింపుతో ముగిసింది. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణపై శిక్షణ

పార్వతీపురం టౌన్: గ్రామీణ స్థాయిలో మెరుగైన సేవలు అందించేందుకు సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ శిక్షణ పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. వైద్యులు, సీహెచ్‌ఓలకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటి సంబంధిత వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, దృష్టి సమస్యలు, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై శిక్షణను అందజేశారు.

పలు రకాల వ్యాధులకు గల మూలకారణాలు, క్షేత్రస్థాయిలో వాటిని సులభంగా గుర్తించే విధంగా చికిత్స, పర్యవేక్షణ, నివారణ అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆరోగ్య కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో వైద్యసేవలు మరింత విస్తృతం చేసి ప్రజా రోగ్యం మెరుగుకు కృషి చేయాలని కోరారు.

గిరిజన డీఎస్సీని ప్రకటించాలి

పార్వతీపురం: గిరిజన డీఎస్సీపై ప్రభుత్వం ప్రకటన చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ అమరావతిలో నిర్వహించిన కలెక్టర్‌ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏప్రిల్ మొదటివారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి జూన్ నెల నాటికి ఉపాధ్యాయ నియామకాలు పూర్తిచేస్తామని ప్రకటించారన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా గిరిజనులను ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియమిస్తామని ఇచ్చిన హామీ సంగతి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఓ నంబర్ 3ను పునరుద్ధరించి గిరిజన (షెడ్యూల్) ప్రాంతంలో ఉపాధ్యాయ ఉద్యోగాలను గిరిజనులకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ఐటీడీఏ పీఓకు గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయులంతా కలిసి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు.

నవోదయకు ఇద్దరి ఎంపిక



ఆర్.దేనిష్ నాయుడు



జె.సాయి శాన్విత

పార్వతీపురం: జవహర్ నవోదయకు గరుగుబిల్లి మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. మండలంలోని ఉల్లిభద్రలో గల కవిరాయిని పాఠశాలలో చదువుతున్న ఆర్.దేనిష్ నాయుడు, మార్కొండపుట్టి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న జె.సాయి శాన్వితలు ఎంపికయ్యారు. వారిద్దరు ఆయాపాఠశాలల్లో చదువుతూ పార్వతీపురం పట్టణంలోని రిమిస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. వారిద్దరు నవోదయకు ఎంపిక కావడంపట్ల ఉపాధ్యాయులు, కోచింగ్ నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

ఏమిటి సారూ...ఇదేం పని

- ముసుగు తొలగింపులో వివక్ష..!



బలిజిపేట బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి తొలగించని ముసుగు



బస్టాండ్ సమీపంలో హైస్కూల్ వద్ద ముసుగు తొలగించిన ఎన్టీఆర్ విగ్రహం

బలిజిపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో కోడ్ అమలులో ఉండడంతో ఎన్నికల నియమావళి ప్రకారం అధికారులు బలిజిపేటలో ఉండే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. అయితే ఎన్నికల అనంతరం ముసుగులు తొలగించాల్సిన అధికారుల తీరు పలు విమర్శలకు దారితీస్తోంది. ఎన్నికలు పూర్తయిన తరువాత విగ్రహాలకు ఉండే ముసుగులు తొలగించడంలో అధికారులు పక్షపాత ధోరణి అవలంబించడం చర్చనీయాంశమైంది. బలిజిపేట బస్టాండ్‌లో ఉండే వైఎస్సార్ విగ్రహానికి ఇంకా ముసుగు తొలగించకుండా వదిలివేయడం, దానికి సమీపంలో ఉండే ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగును తొలగించడం వారి విధివిధానాలకు నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇన్ని రోజులు గడిచినా వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించకుండా అవమానించడం దారుణమని,అధికారులు, సిబ్బంది రాజకీయాలకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జాబ్ కార్డులున్న అందరికీ 'ఉపాధి' పనులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులున్న కుటుంబాల వారికి పనులు కల్పించడానికి సత్వరచర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ పి.త్రివిక్రమ రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో జరుగుతున్న ఫిష్‌పాండ్ పనులను ఏపీఓ భానుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన గ్రామసభల్లో ఆమోదించిన పనుల ఆధారంగా గ్రామాల్లో జాబ్ కార్డులున్న వారికి పనులు కల్పించనున్నట్లు తెలియజేశారు. ఫారం పాండ్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చామని, కాలువల్లో ఫిష్‌పాండ్స్ నిర్మాణం, ట్రెంచ్ కటింగ్ పనులు, ఇతర సామాజిక పరమైన అభివృద్ధి పనులను కల్పించి జాబ్‌కార్డులున్న వారందరికీ ఉపాధి కల్పిస్తున్నామని తెలియ జేశారు. ఏపీఓ భాను మాట్లాడుతూ పేదలకు అవసరమైన జాబ్‌కార్డులు ఇవ్వడానికి చర్యలు చేపట్టామని జాబ్‌కార్డు కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్రమ రవాణాపై ముమ్మర తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషి, ట్రైనీ ఎస్సైలు

పార్వతీపురం రూరల్: నిషేధిత వస్తువుల అక్రమ రవాణా చేపడితే చర్యలు తప్పవని రూరల్ ఎస్సై బి.సంతోషి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని రావికోన బట్టివలస వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, సారా, మద్యం వంటి అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా అనుమానిత కూడళ్ల వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయస్థానంలో హాజరు పరుస్తామని వాహన చోదకులకు హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సైతో పాటు ఇటీవల జిల్లాకు శిక్షణ నిమిత్తం వచ్చిన ట్రైనింగ్ ఎస్సైలు పాల్గొన్నారు.

నేలమట్టమైన నువ్వు చేను

సీతానగరం: ఇటీవల కురిసిన ఈదురుగాలితో కూడిన వర్షానికి మండలంలో పువ్వు కొనలతో ఉన్న నువ్వుచేను నేలమట్టమైంది. దీంతో చేను ఎండి పోవడంతో చేతికొచ్చే నువ్వుపంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో మట్టి నమూనాలు చేసి నీటివనరులున్న పొలాల్లో వేలాది ఎకరాల విస్తీర్ణంలో నువ్వు చేను పంటను రైతులు సాగుచేశారు. నువ్వుకాయలు, పువ్వు కొనలతో ఉన్న పంటపై రెండురోజుల పాటు కురిసిన 55 ఎంఎం వర్షానికి మడుల్లో నీరునిల్వ ఉండిపోయింది. దీంతో మడులలో ఏపుగా పెరిగిన నువ్వుపంట మంగళవారం ఎండకు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నువ్వు పంట రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా చిన్నమ్మ, పెద్దమ్మ వార్ల జాతర



బూర్జలో ఘటాలతో అమ్మవారితో పాటు తిరువీధిలో భక్తులు

సీతానగరం: మండలంలోని తామరఖండిలో చిన్నమ్మవారి జాతర, బూర్జలో పెద్దమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ మేరకు పాతబూర్జ, కొత్తబూర్జలో మంగళవారం సాయంత్రం నుంచి పెద్దమ్మవారి ఘటాలకు డప్పువాయిద్యాలతో తిరువీధి జరిగింది. బుధవారం ఉదయం అంగడి నుంచి ఊరేగింపుగా అమ్మవారి వనం వరకూ ఊరేగించి అనుపోత్సవం నిర్వహిస్తారు. అలాగే తామరఖండిలో చిన్నమ్మవారి అనుపోత్సవం లాంఛనంగా నిర్వహించి పెద్దమ్మవారి పండగను తీసుకురానున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాత్రివేళ రెండు గ్రామాల్లో పౌరాణిక నాటకాలు ఏర్పాటు చేశారు.

లెక్కలేని తనంతో ప్రాణాంతకం

పార్వతీపురం రూరల్: రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించి మితిమీరిన వేగంతో, ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా ఆంక్షలను ధిక్కరించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. వాహనదారుల లెక్కలేని తనంతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. వేగనియంత్రణ, సూచిక బోర్డులు ఎదురుగా కనిపిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఉపాధి నిమిత్తం కూలీలను, శుభకార్యాలకు బంధువులను ప్రమాదపుటంచున వాహనాల్లో తరలించడం ఆందోళన కలిగిస్తోంది.



లగేజీ బొలెరో వాహనంపై ఉన్న సామగ్రిపై కూర్చుని ప్రమాదకరంగా ప్రయాణం



లగేజీ బొలెరో వాహనంపై ఉన్న సామగ్రిపై కూర్చుని ప్రమాదకరంగా ప్రయాణం

నిబంధనలకు విరుద్ధంగా..

పనుల నిమిత్తం కూలీలను తరలించేందుకు వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు ఉపయోగించే సామగ్రితో పాటు కూలీలను వాహనాల్లో తరలిస్తున్నారు. నియమాలను అటుకెక్కిస్తూ రోడ్డు చిన్నదైనా, పెద్దదైనా వాహనాల్లో మితిమీరిన వేగంతో వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న దృశ్యాలు నిత్యకృత్యంలా దర్శనమిస్తున్నాయి. కనీసం కూర్చునే పరిస్థితి లేని ప్రయాణాలు చేస్తూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన ఎన్నో సంఘటనలు ఉన్నప్పటికీ మార్పురాకపోవడం గమనార్హం.

చైతన్యం ఎప్పుడొస్తుందో..?

ప్రమాదాల కట్టడికి ఒక వైపు పోలీస్‌శాఖ, మరో వైపు రవాణాశాఖ చర్యలు తీసుకుంటున్నాయి. ఏటా జనవరిలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నాయి. ప్రమాదాలను నియంత్రించేలా రూల్స్‌ను పాటించేందుకు చైతన్య కార్యక్రమాలను విస్తృతంగానే చేపడుతున్నాయి. ఎక్కడికక్కడ తనిఖీలు చేసి జరిమానాలు భారీగా విధించి అవగాహన కల్పిస్తున్నప్పటికీ వాహనదారుల్లో స్వీయ నియంత్రణ కరువైంది. ప్రమాదం జరిగితే బాధ్యులుగా వాహనయజమాని, డ్రైవర్, కూలీలను తీసుకువెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయినప్పటికీ చైతన్యం అటు వాహన దారులు, ఇటు ప్రయాణించే వారిలో చైతన్యం ఎప్పుడొస్తుందో వేచిచూడాల్సిన దుస్థితి.



నిర్మాణ సామగ్రిపై కూర్చుని ప్రయాణిస్తున్న భవన నిర్మాణ కార్మికులు